క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు రానున్న ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

మాడ్గుల: మండలంలోని అప్పారెడ్డిపల్లిలో ఆదివారం నిర్వహించబోయే లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్‌ఎస్.ప్రవీణ్ కుమార్ హాజరుకాబోతున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు జెపాల్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని పడకల్‌కు చెందిన లక్ష్మమ్మ (62) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందింది. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ శ్రీశైలం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5,000 ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా లింగరావుపల్లికి చెందిన రమాదేవి అనారోగ్యంబారిన పడటంతో ఇటీవల వైద్యం చేయించుకుంది. విషయం తెలుసుకున్న ప్రభాకర్‌రెడ్డి బాధితురాలికి రూ.5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. శివలింగం, రమేష్, గౌస్, మహేష్‌లింగం పాల్గొన్నారు.

వెల్జాల్‌కు చెందిన..

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన బీఆర్‌ఎస్ యువ కార్యకర్త ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. విష్ణువర్ధన్ యాదవ్,యాదయ్య, శ్రీకాంత్, శ్రీను, కుమార్, శేఖర్, తిరుపతయ్య, శ్రీశైలం పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పనులు చేయండి: ఎంపీడీఓ

మంచాల: ఉపాధిహామీ పనులు కొలతల ప్రకారం చేయాలని మంచాల ఎంపీడీఓ బాలశంకర్ అన్నారు. శుక్రవారం మంచాల మండలంలోని ఆరుట్ల, పటేల్ చెరువు తండాలో ఉపాధి పనుల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారం పనులు చేస్తేనే దినసరి కూలీ పడుతుందన్నారు. చాలామంది కూలీలు కొలతల ప్రకారం పనులు చేయడం లేదన్నారు. గ్రామాల్లో ఏఏ పనులు చేపడుతున్నారని పంచాయతీ కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు కురవగానే గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించాలన్నారు. అందుకు కావల్సిన ఏర్పాట్లు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఏపీఓ తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్ తనిఖీ



అంబులెన్స్ సిబ్బందితో శ్రీకాంత్

యాచారం: యాచారం మండల కేంద్రంలో ఉన్న 108 అంబులెన్స్‌ను శుక్రవారం జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ శ్రీకాంత్ తనిఖీ చేశారు. అంబులెన్స్‌లో అన్ని వసతులు ఉన్నాయా.. అత్యవసర సమయాల్లో రోగులకు ఇచ్చేందుకు మందులు అందుబాటులో ఉన్నాయా అని పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో బాధితుల ప్రాణాలు కాపాడటానికి కావాల్సిన మందులను సిద్ధంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈఎంఈ రాజబాబు, అడిటర్ ఫయాజ్ తదితరులున్నారు.

పన్ను చెల్లించని 11 షాపుల సీజ్

ఇబ్రహీంపట్నం: పన్ను చెల్లించని పలు షాపులను ఇబ్రహీంపట్నం మున్సిపల్ సిబ్బంది శుక్రవారం సీజ్ చేశారు. మున్సిపల్ కేంద్రంలోని సుమారు 11 దుకాణాలను సీజ్ చేశారు. అయితే వెంటనే పలువురు పన్నులు చెల్లించడంతో తిరిగి ఆయా షాపులను ఓపెన్ చేశారు. సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని అధికారులు కోరారు.

సీఎం రేవంత్‌ను కలిసిన నేతలు



పుష్పగుచ్ఛం అందిస్తున్న కేశవులు

ఆమనగల్లు: రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని శుక్రవారం ఆమనగల్లు, కడ్తాల మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు కలిశారు. హైదరాబాద్‌లోని సీఎం నివాసంలో.. మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు, జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి సీఎంను కలిసి ఆయా మండలాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

ముంచుకొస్తున్న గడువు

- మంచాల మండలానికి రూ.4.58 కోట్ల ఈజీఎస్ నిధులు
- మెజార్టీ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి
- మిగతా చోట్ల మార్చి 30లోపు పూర్తిచేయకుంటే నిధులు వెనక్కి!



ధర్మన్నగూడెంలో ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు

యాచారం: గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టుకుంది. ఈజీఎస్ నిధుల పుణ్యామా అని కాలనీల్లో సీసీ రోడ్లు వేస్తుండటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. యాచారం మండలంలోని 24 గ్రామ పంచాయతీలకు గాను గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.4.58 కోట్ల నిధులు మంజూరవ్వగా.. ఇందులో చిన్న గ్రామ పంచాయతీలకు రూ.15 లక్షలకు పైగానే నిధులు కేటాయించారు. మేజర్ గ్రామ పంచాయతీలైన యాచారం, చింతపట్ల, మాల్, నందివనపర్తి, గునుగల్, మంతన్‌గౌరెల్లి తదితర గ్రామాలకు రూ.25 లక్షలకు పైగానే నిధులు మంజూరయ్యాయి. ఆయా నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. యాచారం, మొండిగౌరెల్లి, చింతపట్ల, గునుగల్, గడ్డమల్లయ్యగూడ, తమ్మలోనిగూడ, తక్కళ్లపల్లి, మొండిగౌరెల్లి తదితర గ్రామాల్లో ఇప్పటికే సీసీ రోడ్ల పనులు పూర్తయ్యాయి.

వారమే గడువు...

కాగా ఈజీఎస్ ద్వారా మంజూరైన నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనుల ప్రారంభానికి వారం రోజుల గడువే మిగిలి ఉంది. రూ.4.58 కోట్ల నిధుల్లో మండలంలోని 24 గ్రామాల్లో ఇప్పటివరకు రూ.2.5 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేశారు. మిగితా గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయి. వారంలోపు రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించకుంటే మంజూరైన నిధులు వెనక్కి వెళ్లిపోయే అవకాశం ఉంటుంది. అయితే నస్దిక్‌సింగారం, చింతుల్ల తదితర గ్రామాల్లో రోడ్ల నిర్మాణ పనులు ఇప్పటికీ ప్రారంభం కాలేదు. రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్న గుత్తేదార్లను రాజకీయ పార్టీల నేతలు కమీషన్లు అడగడంతో పనులు చేయడానికి గుత్తేదార్లు ఆసక్తి చూపడం లేదనే విమర్శలున్నాయి.

ఉపాధి నిధులతోనే అభివృద్ధి



గ్రామాల్లో కేంద్ర నిధులతోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఈజీఎస్ నిధుల ద్వారానే నర్సరీలు, పల్లె ప్రకృతి వనాలు, చెట్ల పెంపకం, ఉపాధి పనులు జరుగుతున్నాయి. ప్రతి యేటా ఈజీఎస్ నిధులతోనే గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా రేవంత్‌రెడ్డి సర్కార్ పల్లెలకు నిధులు మంజూరు చేసి అభివృద్ధికి సహకరించాలి.

– కొలన్ మల్లారెడ్డి, మొండిగౌరెల్లి

పనులు పూర్తిచేయాలి



యాచారం మండలంలోని మెజార్టీ గ్రామాల్లో ఇప్పటికే సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మిగితా గ్రామాల్లో వారం రోజుల్లోపు రోడ్ల నిర్మాణం పూర్తిచేయాలి. లేదంటే ఈజీఎస్ నిధులు వెనక్కి వెళ్లిపోయే అవకాశం ఉంటుంది. వెంటనే పనులు పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి ఉంది.

– ఉస్మాన్ పఠాన్, ఏఈ, పంచాయతీ రాజ్ శాఖ

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- క్వాలిటీ కంట్రోల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోహన్‌రావు
- ఇబ్రహీంపట్నంలో రోడ్ల పరిశీలన



ఉప్పరిగూడలో రోడ్డు నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే చర్యలు తప్పవని క్వాలిటీ కంట్రోల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోహన్‌రావు పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలో పంచాయతీరాజ్ నిధులతో వేసిన ఎల్మినేడు, పోచారం, ఉప్పరిగూడ రోడ్లను శుక్రవారం క్యూసీ డిపార్ట్‌మెంట్ అధికారులు పరిశీలించారు. రోడ్డు మధ్యలో హోల్ చేసి నాణ్యతను పరిశీలించారు. మెటీరియల్‌ను బయటకు తీసి నమూనాలను సేకరించారు. మోహన్‌రావు మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లు నాసిరకమైన మెటీరియల్ ఉపయోగించినట్లు తేలితే బిల్లుల్లో కోత పెడతామన్నారు. సంబంధిత అధికారులు నిరంతరం పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ డీఈ వెంకటేశ్వర రెడ్డి, ఏఈ సంతోష్, ఇబ్రహీంపట్నం మండల పంచాయతీరాజ్ ఇంజనీర్ ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి చైర్మన్‌గా పాండు రంగారెడ్డి



ఇబ్రహీంపట్నం: ఉప్పరిగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) ఇన్‌చార్జి చైర్మన్‌గా ఎదుళ్ల పాండురంగారెడ్డిని ఎన్నుకున్నారు. ఈ మేరకు జిల్లా కోఆపరేటివ్ అధికారులకు శుక్రవారం డైరెక్టర్లు ప్రతిపాదనలు పంపించారు. సొసైటీకి సంబంధించిన 11 మంది డైరెక్టర్లు.. చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస నోటీసులు అందజేశారు. గతనెల 22న డీసీఓ ధాత్రిదేవి ఆధ్వర్యంలో అవిశ్వాస సమావేశం నిర్వహించారు. అయితే డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాసం సరైన ప్రక్రియలో లేదని ఆ సొసైటీ చైర్మన్ టేకుల సుదర్శన్‌రెడ్డి, వైస్ చైర్మన్ క్యామ శంకర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కోర్టు ఆదేశానుసారం ఆ సమావేశ వివరాలను బయటకు వెల్లడించలేదు. చైర్మన్ పిటిషన్‌పై వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును పెండింగ్‌లో పెట్టింది. తాజాగా సుదర్శన్‌రెడ్డి పిటిషన్‌ను కోర్టు డిస్మిస్ చేస్తూ తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో ఆ పదవిని ఆశిస్తున్న పాండు రంగారెడ్డికి లైన్‌క్లియర్ అయినట్లయ్యింది. ఈ క్రమంలో పీఏసీఎస్ చైర్మన్‌గా పాండు రంగారెడ్డికి మద్దతునిస్తూ డైరెక్టర్లు శుక్రవారం తీర్మానంచేశారు. తిరిగి నూతన చైర్మన్‌ను ఎన్నుకునేంత వరకు పీఏసీఎస్ ఇన్‌చార్జి చైర్మన్‌గా పాండు రంగారెడ్డి కొనసాగనున్నారు.

యువత రక్తదానం చేయాలి

డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్



రక్తదానం చేస్తున్న యువకులు

ఇబ్రహీంపట్నం: యువత సేవా కార్యక్రమాల్లో ముందుండాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేశ్ పిలుపునిచ్చారు. విప్లవవీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని పురస్కరించుకొని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఇబ్రహీంపట్నంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. భగత్‌సింగ్, గురురాజ్, సుఖ్‌దేవ్ స్వాతంత్రం కోసం తమ ప్రాణాలను అర్పించారన్నారు. ఇలా ప్రతి ఒక్కరూ దేశభక్తిని కలిగిఉండాలన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ప్రాణాపాయస్థితిలో ఉన్నవారిని ఆదుకునేందుకు యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు జంగయ్య, రాఘవేందర్, చరణ్, మహేశ్, శ్రీకాంత్, వంశీ, తరంగ్, వేణు, వినయ్, యాదగిరి పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

ఏసీపీ రాజు



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ రాజు

మంచాల: ప్రశాంత ఎన్నికలకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు అన్నారు. శుక్రవారం మంచాల మండలంలోని ఆరుట్ల, పటేల్ చెరువు తండాలో ఆయన పర్యటించారు. యువకులకు అవగాహన కల్పించారు. లోక్‌సభ ఎన్నికల్లో యువత నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించవద్దని సూచించారు. ఎలాంటి గొడవలకు, ఘర్షణలకు పాల్పడవద్దని సూచించారు. అదే విధంగా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మంచాల సీఐ బాబ్యానాయక్, ఎస్ఐ రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

తులం బంగారం, నగదు అందజేత



వధువుకు సాయం అందిస్తున్న గోదాదేవి సత్యం దంపతులు

ఆమనగల్లు: మండలంలోని శెట్టిపల్లికి చెందిన యువతి వివాహం సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ శెట్టిపల్లి గోదాదేవి, సత్యం దంపతులు రూ.10వేలు, తులం బంగారం సాయం అందించారు. శెట్టిపల్లికి చెందిన కొమ్ము యాదమ్మ, విష్ణయ్య కుమార్తె వివాహం సందర్భంగా గోదాదేవి సత్యం దంపతులు శుక్రవారం వారికి సాయం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వీరయ్య, అర్జున్‌రావ్, నర్సింహ, మహేశ్, పెద్దయ్య, మల్లయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామానికి చెందిన బుడ్డయ్య మృతిచెందడంతో మృతుడి కుటుంబ సభ్యులను వారు పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు.

ఫీజుల పేరుతో వేధించొద్దు: ఏబీవీపీ

ఇబ్రహీంపట్నం: ఫీజుల పేరుతో విద్యార్థులను వేధిస్తే సహించేదిలేదని ఏబీవీపీ నేతలు హెచ్చరించారు. ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల కోసం విద్యార్థులను బయట కూర్చొబెట్టడాన్ని నిరసిస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించబోమని యాజమాన్యం హామీ ఇచ్చిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మహేందర్, నవీన్, పవన్, ఆదర్శ్, చరణ్, అనిల్, సురేందర్, కార్తీక్ శ్రీకాంత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

మైసమ్మ సన్నిధిలో ఎంపీ రాములు

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండిలో కొలువైయున్న మైసమ్మ అమ్మవారిని నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు, నాగర్ కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు. అర్చక సిబ్బంది, భక్తులు ఉన్నారు.



రాములును సన్మానించిన ఆలయ సిబ్బంది, నాయకులు

సమతుల ఆహారంతో ఆరోగ్యం

ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మ



మాడ్గుల: ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు

మాడ్గుల: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్ వైజర్ పద్మ అన్నారు. మాడ్గుల మండలం అర్కపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషక పక్షం నిర్వహించారు. చౌకగా దొరికే ఆకుకూరలు, కూరగాయలతో పోషకాహారాన్ని తయారు చేసి ప్రదర్శించారు. అనంతరం పద్మ మాట్లాడారు. ఆహార లేమితో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, మహిళల్లో రక్తహీనత వచ్చే ప్రమాదముందన్నారు. పోషక విలువలున్న ఆహారపదార్థాలను సమతుల తీసుకోవడంతోనే రక్తహీనతను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు గీత, విజయలక్ష్మి, దేవమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ సిబ్బంది అన్నారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషక పక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. చౌకగా దొరికే ఆకుకూరలు, కాయగూరలతో పోషక ఆహారాన్ని తయారుచేసి ప్రదర్శించారు. ఐసీడీఎస్, అంగన్‌వాడీ అధికారులు పోషక ఆహారంపై మహిళలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, మహిళలు, ఆశ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

బీజేపీ ఎస్సీమోర్చా ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్



నియామకపత్రం అందుకుంటున్న వెంకటేశ్

తుర్కయంజాల్: మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడ నీలం సంజీవరెడ్డి నగర్‌కు చెందిన వెంకటేశ్ మున్సిపాలిటీ బీజేపీ ఎస్సీమోర్చా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు తూళ్ల నరసింహగౌడ్ శుక్రవారం వెంకటేశ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు బోసుపల్లి ప్రతాప్, రాష్ట్ర ఎస్సీమోర్చా కోశాధికారి రమేష్, నాయకులు ప్రేమ్‌సాయి తదితరులు పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుదాం

పీఆర్టీయూ మండల అధ్యక్షుడు పరమేష్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ఇబ్రహీంపట్నం రూరల్: నీరు లేనిదే జీవం లేదని పీఆర్టీయూ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షుడు పరమేష్ పేర్కొన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని శుక్రవారం ఆదిబట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. భూమి పుట్టుక, నీటి ఆవశ్యకత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. నీటిని పొదుపుగా వాడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు బబ్లీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



ఆమనగల్లు: ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని వేంకటగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ ధర్మకర్త కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. జాతర సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పెద్దఎత్తున్న దుకాణాలు వెలిశాయి.

స్వామివారికి పల్లకీసేవ..

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్‌లో వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. సీతా రామంజనేయస్వామి భజన మండలి ఆధ్వర్యంలో శుక్రవారం స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోపాల్, మాజీ సర్పంచ్ విఠలయ్యగౌడ్, మాజీ ఉప సర్పంచ్ వెంకటేశ్, నాయకులు రంగయ్య, బాలకృష్ణ, లింగం, రమేశ్‌యాదవ్, రాజు, పవన్, రవికుమార్ తదితరులు ఉన్నారు.

తలకొండపల్లిలో రథోత్సవం..

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్ కలికిదొనగుట్ట గోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం స్వామివారి రథోత్సవం నిర్వహించారు. వేదపండితులు పట్టాబిరామశర్మ, సిద్ధాంతి కృష్ణమూర్తి శర్మ, నితిన్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, ట్రస్టు చైర్మన్ సిద్ధాంతి పట్టాభిరామ శర్మ, కార్యవర్గ సభ్యులు కృష్ణమూర్తి, నితిన్‌శర్మ, మల్లారెడ్డి, అంజిరెడ్డి, నారాయణ, యాదయ్య, మల్లేశ్, భక్తులు పాల్గొన్నారు.

బెల్టుషాపుపై ఎస్‌ఓటీ పోలీసుల దాడి

నిర్వాహకుడి అరెస్టు

ఇబ్రహీంపట్నం రూరల్: బెల్టుషాపుపై ఎస్‌ఓటీ పోలీసులు దాడి చేసి అక్రమంగా నిల్వఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్న సంఘటన ఆదిబట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. ఆదిబట్ల మున్సిపాలిటీ కొంగరకలాన్‌కు చెందిన శంకరయ్య అక్రమ సంపాదనకు అలవాటుపడి కొద్దిరోజులుగా బెల్టుషాపు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోని నిర్మానుష్య ప్రాంతంలో మద్యం అమ్ముతున్నాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ, ఆదిబట్ల పోలీసులు శుక్రవారం సంయుక్తంగా దాడిచేయగా 88 మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు శంకరయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

అద్భుతంగా థీమ్ పార్కు నిర్మాణం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: దాదాపు ఎకరం స్థలంతో అద్భుతమైన థీమ్ పార్కును బీఎన్‌రెడ్డి నగర్‌లో నిర్మిస్తున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డిన్ ఫేజ్–3లో రూ.1.25 కోట్లతో నిర్మిస్తున్న థీమ్‌పార్కు పనులను ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, థీమ్ పార్కులో అద్భుతమైన బుద్ధుడి విగ్రహం, యోగా షెడ్, ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ పార్కు, వాకింగ్ ట్రాక్, టాయిలెట్స్ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. నియోజకవర్గంలోని అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు. నియోజక అభివృద్ధే లక్ష్యమని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, అనంతుల రాజిరెడ్డి, రవి, రాఘవేందర్‌రావు, రాంబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.